# సజాతి ధ్రువాలు

రాజ్యలక్ష్మి కొలాస్కర్

"ఒదినా! నా పింక్ డ్రెస్ ఇస్త్రీ చేయమన్నాను కదా! ఎందుకు చెయ్యలేదు?" కరుస్తున్నట్లు అడిగింది విజయ.

రెండేళ్ల కూతురికి టిఫిన్ తినిపించడానికి నానా అవస్థలూ పడుతున్న శ్రీనిజ కోపంగా ఆడబడుచు వైపు తిరిగింది.

"నిన్న నేను యూనివర్సిటీ నుంచి ఇల్లు చేరుకునేసరికి ఆరు గంటలయింది. ఎప్పటిలాగా ఇంటెడు పనీ నా కోసం ఎదురు చూస్తోంది. దానికి తోడు ఈ రోజు నాకు టెస్టుంది. నీ అల్మైర తీసిచూసాను. ఇస్త్రీ చేసినవి చాలా డ్రెసులు ఉన్నాయి కదాని చెయ్యలేదు."

ఎక్కడ నుంచి విందో వచ్చేసింది శేషమ్మ. విషయమేంటో తెలియకపోయినా కోడలి మీద యుద్ధం ప్రకటించటానికి ఆవిడ ఎప్పుడూ సిద్ధమే. తల్లి వైపు తిరిగి అతిగారంగా ఫిర్యాదు చేసింది విజయ. "చూడమ్మా! ఈ రోజు మా ఫ్రెండ్సందరం పింక్ డ్రెస్ వేసుకోవాలనుకున్నాం. నా చుడీదార్, చున్నీ ఇస్త్రీ చెయ్యమని ఈవిడగార్కి నిన్న ప్రొద్దున్ననగా చెప్పాను. ఇప్పుడేమో ఏంటో కుంటిసాకులు చెప్తోంది."

"వింటూనే వున్నానమ్మా!" కూతుర్ని చెయ్యి పట్టి వెనక్కిలాగి కోడలి మీద మీద కెళ్లింది శేషమ్మ. "ఆలికి అన్నం పెట్టటం ఊరికి ఉపకారం" అన్నాట్ట నీలాటి వాడెవడో వెనకటికి. మమ్మల్ని ఉద్ధరించటానికి చదువుతున్నావా నీవు? తైతక్కలాడుతూ కాలేజీ కెళ్ళొస్తూ తమాషాగా కాలం గడపటానికి నువ్వు హాస్టల్లో లేవు. అత్తారింట్లో వున్నావు. కాలేజి వంకబెట్టి పని ఎగ్గొట్టడం నీకు బాగా అలవాటై పోయింది. ఆ బట్టలు ఇస్త్రీ చెయ్యకుండా ఇల్లెలా కదుల్తావో చూస్తాను."

శ్రీనిజ రక్తం సల సల 'మరిగింది.' "అత్తయ్యా టైము తొమ్మిదిన్నరవుతోంది. పరీక్ష పదింటికి మొదలవుతుంది. మీ కోరిక ప్రకారం పరీక్ష మానేస్తాను. అనక మీ అబ్బాయి వచ్చాక, "మీ అమ్మగారు విజయ బట్టలు ఇస్త్రీ చెయ్యమన్నారు. అందుకని పరీక్షకి వెళ్ళలేకపోయాను, అని చెప్తాను ఏమంటారు?"

శేషమ్మ గాలితీసేసిన బెలూన్‌లా తగ్గింది.

''వెళ్ళమ్మా ! వెళ్ళు. నువ్వో శూర్పణఖ వన్న సంగతి తెలియక నిన్ను పనిపాటలు చెయ్యమనటం నాదే తప్పు'' తిప్పుకుంటూ వెళ్ళిపోయింది శేషమ్మ.

''నానమ్మా! వాణిని తియ్యి'' కూతుర్ని ఆయా కప్పగించి హడావిడిగా బయలుదేరింది శ్రీనిజ. ఎంత త్వరగా వెళ్ళినా పెన్కు మొదలయిపోయింది. భయం భయంగా ప్రొఫెసరు నుద్దేశించి అంది — ''మే ఐ కమిన్ సర్ ?''

క్వశ్చన్ పేపరు సీరియస్‌గా చూసుకుంటున్న విద్యార్థులంతా తలలెత్తి చూశారు. వాళ్ళతోపాటే ప్రొఫెసరుకూడా ! ఆయన ముఖం అప్రసన్నంగా మారింది.

''సో యూ లివ్‌డ్ అప్‌టు యువర్ రెప్యుటేషన్ ఆఫ్ బీయింగ్ లేట్ కమిన్ !''

సిగ్గుతో కుంచించుకుపోతూ తన సీట్లో కూర్చుంది. జోరీగల్లా మనసులో ముసురుతున్న ఆలోచనల్ని తోల్తూ పరీక్ష వ్రాయడాన్కి ప్రయత్నించ సాగింది.

శ్రద్ధగా చదివి పరీక్షలు వ్రాసే విద్యార్థులకి గంటలు క్షణాల్లా గడిచిపోతాయి. ''టైమ్ ఈజ్ అప్'' అనే ప్రొఫెసర్ కంఠం శ్రీనిజని ఈ లోకంలోకి తీసుకొచ్చింది. వ్రాసిన కాగితాలు బొత్తిగా పెట్టింది. ప్రొఫెసర్ వచ్చి అవి అందుకుంటూ అన్నారు — ''మిసెస్ శ్రీనిజా! లంచ్ బ్రేక్ అవగానే ఒకసారి వచ్చి నన్ను కలవండి.''

ప్రొఫెసర్ బయటకి వెళ్ళగానే తరువాత లెక్చరర్ వచ్చారు. ఆయన గోల ఆయనది. శ్రీనిజ బాధ శ్రీనిజది. ''ఎందుకు రమ్మన్నారు ప్రొఫెసర్'' అనుకుంటూ భయపడిపోతోంది. ఒళ్ళంతా చెమటలు పడుతున్నాయి. ''బహుశ ఆయన క్లాసులు తరచు ఎగ్గొడుతున్నాననేమో ! ఎందుకని అడిగితే ఎలా చెప్పుంది ! ఏం చెప్పుంది తన అవస్థ ! చెప్పినా ఆయన కర్థమవుతుందా ? అసలు యమ్మెస్సీలో జాయినవటం తన పొరపాటు. అదీ ఇంట్లో వ్యక్తుల స్వభావాల గురించి తెలిసికూడా !'' శ్రీనిజ ఆలోచనలు ఆమె నిమిత్తం లేకుండానే గతంలోంచి వర్తమానం లోకి వర్తమానంలోంచి గతంలోకి పరుగులు పెడ్తున్నాయి. నాలుగు సంవత్సరాల క్రిందట :

ఆ రోజు బియ్యస్సీ మార్కుల్ షీట్స్ వచ్చాయి. యూనివర్సిటీ ఫస్టుగా రెండు గోల్డ్‌మెడల్స్‌తో పాసయిన శ్రీనిజకి సంతోషంగా జేబులోవున్న యాభై రూపాయలు తీసిచ్చి ఏమైనా కొనుక్కోమన్నాడు తండ్రి. అవి తీసుకుని తన కిష్టమయిన బుక్ షాపులోకి అడుగుపెట్టింది. ఆమెని చూస్తూనే సంతోషంగా ఆహ్వానించాడు సుధాకర్. అతను ఆ షాపు ప్రొప్రయిటరు కొడుకు. ''రండి రండి ! సరిగ్గా సమయానికి వచ్చారు. చాలా కొత్త టైటిల్స్ వచ్చాయి.'' శ్రీనిజకి పుస్తకాల పిచ్చి. ప్రతి పైసా పోగుచేసి పుస్తకాలు కొనుక్కుంటుంది. సుధాకర్‌కి శ్రీనిజ పిచ్చి. ఆమె ఎప్పుడొచ్చినా ఆమె వెనకే తిరుగుతూ పుస్తకాలు చూపిస్తూ, కబుర్లు చెప్తూ తన్మయత్వం చెందుతుంటాడు. ఆమె కొన్న ప్రతి పుస్తకానికి సంతోషంగా పదిహేను శాతం డిస్కౌంట్ ఇస్తాడు.

శ్రీనిజ వోడ్ హౌస్ రాక్ వైపు దారితీసింది. ఆమె పుస్తకాలు సెలెక్టు చేసుకున్నాక అన్నాడు.

''ఈ రోజు మీతో కొంచెం మాట్లాడాలండి, ఒక అరగంట స్పేర్ చెయ్యగలరా ?''

''మాట్లాడండి !''

''ఇక్కడ కాదు. ఆ పక్కగా నా ఆఫీస్ రూమ్ వుంది. అక్కడైతే మనవెవరూ డిస్టర్బ్ చెయ్యరు ప్లీజ్ ! ఒక్క అరగంట.''

అతని కంఠంలో అభ్యర్థన ఆమెచేత అడుగు వేయించింది. ఇద్దరూ కుర్చీల్లో సెటిలయ్యాక అన్నాడు సుధాకర్—

''మీరు ఇన్నిసార్లు ఇక్కడికి వచ్చినా మీ పేరేమిటో నాకు తెలియదు. మీరంటే మాత్రం నాకు చాలా ఇష్టం. మీరు చదివే పుస్తకాలనుబట్టి, మీ మాటలనుబట్టి మీ అభిరుచులు, అభీష్టాలు ఒక్కటేనన్న భావన నాకు కల్గింది. మీ కిష్టమైతే మిమ్మల్ని పెళ్ళి చేసుకోవాలనుంది. నా గురించి వివరాలు చెప్తున్నాను వినండి. నా పేరు సుధాకర్. బియ్యే చదివాను. వయసు ఇరవై ఆరు. మా ఇంట్లో పెద్దవాడ్ని. నా తరువాత తమ్ముడు, ఇద్దరు చెల్లెళ్ళు. మాకు ఈ షాపు, ఒక ఫ్యాన్సీ షాపు, ఒక హోల్‌సేల్ క్లాత్ షాపు, ఒక ఆటోమొబైల్ స్పేర్ పార్ట్స్ షాపు వున్నాయి. మా అందరికీ తలోకటీ అన్న మాట. ఇవికాక పెద్ద ఇల్లుంది. వాహనాలు వగైరా చిల్లరమల్లర ఆస్తి వుంది. బియ్యేతో చదువుకి గుడ్‌బై చెప్పేసి కుదురుగా బిజినెస్ చేసుకుంటున్నాను.''

అతను చెప్పేతీరుకి శ్రీనిజకి నవ్వొచ్చింది. నవ్వుతూనే అంది. ''నా గురించి చెప్పే అవసరం లేదు. మనిద్దరి సంబంధం కుదరటం అసంభవం. ఈ బుక్స్‌కి బిల్ రాస్తే వెళ్తాను'' లేవబోతున్న శ్రీనిజని చెయ్యిపట్టి ఆపేశాడు.

''ఎందుకు అసంభవమో కారణాలు చెప్పి వెళ్ళండి.''

శ్రీనిజ ఇబ్బందిగా అతని చేతిలోని తన చెయ్యి వంక చూసింది.

''సారీ'' వదిలేశాడతను. ''చెప్పండిప్పుడు''.

''వినండయితే ! మీ స్థాయికీ, మా స్థాయికి చాలా చాలా తేడా వుంది. మా నాన్నగారు పైసా కట్నమివ్వలేరు. కట్నం వద్దని మీరన్నా బహుశా మీ తల్లిదండ్రులు ఒప్పుకోరు. పోనీ, మీరు మీ తల్లి తండ్రులూ కూడా పొరపాటున ఒప్పుకున్నారను కుందాము. ఇంకో అడ్డంకి వుంది. నేను బియ్యెస్సీ పాసయ్యాను. పెళ్ళి చేసుకోవటాన్కి అభ్యంతరం లేదుగాని చదువు ఆపటం ఏమాత్రం ఇష్టంలేదు. యమ్మెస్సీ చదివితీరాలని నా ప్రస్తుతాభిప్రాయం. తనకంటె ఎక్కువగా భార్య చదువుకోవటానికి ఏ భర్త ఇష్టపడతాడు ?''

''అయిపోయాయా మీ వాదనలు ?'' ఆశ్చర్యంగా చూసింది సుధాకర్‌ని శ్రీనిజ.

''మరి నా సమాధానాలు వినండి. నిజంగానే కట్నం తీసుకోవటం నా కిష్టం లేదు. మా అమ్మ నాన్నా కావాలని పట్టుబడితే వాళ్ళకే విధంగా సమాధానం చెప్పాలో నాకు తెలుసు. రెండవది. నాకు రాని చదువు నా భార్యకి రావటం నాకు గర్వకారణం. మీరు పి. హెచ్ డి. చేసినా నాకు అభ్యంతరంలేదు. అఫ్‌కోర్స్ తన భర్త తన కంటె తక్కువ చదివిన వాడనే నామోషీ ఆడవాళ్ళకుండ వచ్చు. నా ఉద్దేశంలో అది చాలా తెలివితక్కువ. మన ఉదాహరణే తీసుకోండి. మీరు డాక్టరేట్ తీసుకున్నా నాకున్న లోకజ్ఞానంతో, వ్యాపారదక్షతలో, లౌక్యంతో వందో వంతు మీకు రాదు. అది ఫార్మల్ డిగ్రీస్‌కి కాంపెన్సేషనన్న మాట. అది గుర్తించే సంస్కారం మీలో వుండాలి !'

శ్రీనిజ కళ్ళల్లో అడ్మిరేషన్ గుర్తించి కంటిన్యూ చేశాడు. ''మీ రొప్పుకుంటే ఒక షరతు.'' కళ్ళతోనే ప్రశ్నించింది. ''అందరు యువతులు కోరుకునేట్టు పెళ్ళవగానే మా యింట్లోంచి వచ్చేసి వేరు కాపురం సాధ్యం కాదు. మీరు మా చెల్లెళ్ళు తమ్ములతో అమ్మ నాన్న లందరితో కలిసే వుండాలి.''

అప్రయత్నంగా బుర్ర వూపింది శ్రీనిజ. ''అంటే ?'' చిలిపిగా అడిగాడు సుధాకర్. శ్రీనిజకి తనేం చేసిందో తెలిసి సిగ్గుపడిపోయింది. బంగారుగా అంది ''నాకేం తెలియదు. మా యింటికొచ్చి అడగండి''

శేషమ్మ కొడుకుతో హోరాహోరీ పోట్లాడింది ''కట్నంలేని కోడల్ని తెస్తావా'' అంటూ. సుధాకర్ ఇంట్లోంచి వెళ్ళిపోతానని బెదిరించేసరికి తగ్గింది సుధాకర్ ఆస్తి తీసుకెళ్ళకపోయినా తన సామర్థ్యంతో ఏవైనా సమకూర్చుకోగలడు. ఎటొచ్చీ దెబ్బ కుటుంబానికే. సుధాకర్ ఎస్. ఏ ఫస్టియర్‌లో జాయినవగానే శేషమ్మ భర్తకి పక్షవాతం వచ్చి కాలూ, చెయ్యీ పడిపోయాయి. చదువు మానేసి అతి కొద్దికాలంలో వ్యాపారంలోని ఒడిదుడుకులన్నీ నేర్చుకుని అతి సమర్థవంతంగా నిర్వహించు కొస్తున్నాడు. మహేష్ ఇప్పుడిప్పుడే నేర్చుకుంటున్నాడు.

పెళ్ళి ఏ గొడవా లేకుండా జరిగిపోయింది సుధాకర్ కోరిక మీద ఆ సంవత్సరం మానేసి మళ్ళీ సంవత్సరం జాయినవుదామనే వుద్దేశ్యంతో అప్లై చెయ్యలేదు శ్రీనిజ. హనీమూన్‌కి వెళ్ళిన పదిహేను రోజులు సుఖపడిందేమో ! కాపురానికి రావటంతోటే కోడలికి నరకం అంటే ఎలా వుంటుందో కొంచెం కొంచెం రుచి చూపించసాగింది. తల్లి అండ చూసుకొని పెద్దాడపడుచు విజయ, మరిది మహేష్ కూడా ఒదిన మీద అధికారం చెలాయించే వాళ్ళే. ఎటొచ్చీ చిన్నాడబడుచు లలిత మాత్రం అసూయ ద్వేషాల కలితమైన పన్నెండేళ్ళ వయసులో వుంది. అందమైన ఒదినంటే అభిమానంగా వుండేది.

శ్రీనిజ కాపురానికి కొచ్చేసరికే ఇంట్లో పని మనిషి లేకుండా జాగ్రత్త పడింది శేషమ్మ. వంట, అంట్లు, ఇల్లు క్లీనింగ్ మొత్తం పనంతా క్రమ క్రమంగా పంథొమ్మిదేళ్ళ శ్రీనిజపై పడింది. పనికాక పైన సాధింపులు సూటీపోటీ మాటలు. అర్థంలేని అధికారం! ఒక్కోసారి భర్తకి చెబుదామా అనుకునేది. అంతలోనే జాలి ముంచుకొచ్చేది ప్రొద్దున్న తొమ్మిది గంటలకి ఇంటినుంచి వెళ్ళిపోయి మళ్ళీ రాత్రి తొమ్మిదిన్నర పది ప్రాంతాల వచ్చేవాడు. అప్పుడు కూర్చోబెట్టి తను ఫిర్యాదులు మొదలెడితే అతని మనస్సెలా వుంటుందో, ఇంట్లో ఏం గొడవ లవుతాయో అన్న భయంతో నోరు విప్పేదికాదు. శ్రీనిజలో ఈ బలహీనత కనిపెట్టిన శేషమ్మ రోజు రోజుకి విజృంభించేది. సుధాకర్ ఇంట్లో వున్న సమయంలో మాత్రం అతి మేధావంతంగా నటించేది.

సుధాకర్‌కి కూడా ఇంటి విషయాలంతగా పట్టేవి కావు.

పెళ్ళయిన ఆర్నెల్లకే శ్రీనిజకి నెల తప్పింది. మనసు చికాగ్గా వున్నప్పుడు టాబ్లెట్స్ వేసుకోవటం మర్చిపోయిన మూలంగా! శ్రీనిజకి దిగులు ముంచుకొచ్చింది. ఇంక చదువు సంతకే అనుకుంది. సుధాకర్ ఓదార్చాడు, "అదేమిటి సిరీ! పిల్లలున్నంత మాత్రాన చదువుకోకూడదని రూలు లేదుకదా! మనకి కావలసినంత డబ్బుంది. ఫుల్‌టైము ఆయాని కుదుర్చుకుందాము. అమ్మ ఎలాగూ వుండనేవుంది."

అయిదో నెలలో డాక్టరు మరింత విచారం కల్గించే వార్త చెప్పింది. సుధాకర్ బ్లడ్ ఆర్ హెచ్ నెగెటివ్. శ్రీనిజ ఆర్ హెచ్ పాజిటివ్. ఈ కాంబినేషన్ వున్నవాళ్ళకి సాధారణంగా అబార్షన్ జరుగుతుంది. ఒకవేళ డెలివరీ అయితే స్టిల్ బేబీ పుడుతుంది. అదీకాక బ్రతికివున్న బిడ్డ పుట్టినా పుట్టిన మరుక్షణం బిడ్డకి బ్లడ్ ట్రాన్స్‌ఫ్యూజన్ చెయ్యకపోతే చచ్చిపోతుంది. చేస్తే బ్రతికే ఛాన్సుంది. తరువాత వచ్చిన ప్రెగ్నెన్సీలు ఎట్టి పరిస్థితుల్లోనూ నిలవ్వు. ఇప్పుడైనా శ్రీనిజ చాలా జాగ్రత్తగా వుండాలి.

సుధాకర్ తల్లి స్వభావం తెల్సినవాడవటంతో బాగా ఆలోచించి శ్రీనిజని వాళ్ళమ్మగారింటికి పంపించేశాడు. తల్లికి విషయం తెలియనియ్యలేదు.

అతికష్టంమీద వాణి బ్రతికింది. అప్పుడే శ్రీనిజకి ట్యూబెక్టమీ కూడా చేసేశారు. సుధాకర్ శ్రీనిజ ఈ విషయాలేవీ శేషమ్మకి తెలియకుండా జాగ్రత్తపడ్డారు

వాణికి ఏడాది నిండుతున్నా శ్రీనిజ యమ్మెస్సీ మాటెత్తకపోవటంతో ఒకరోజు సుధాకరే ఆ విషయం ప్రస్తావించాడు. అతడికి ఏ మూలో గిల్టీగా వుండేది. తనమూలంగా శ్రీనిజ బ్రిలియన్స్ అంతా వంటింటికే పరిమితమైపోతుందే అని.

"ఏమిటి సిరీ! ఈ ఏడాదైనా యూనివర్శిటీలో జాయినవ్వవా? అప్లికేషన్ ఫార్మ్స్ తెచ్చాను."

మైలవరం లయన్సుక్లబ్ ఆధ్వర్యంలో ఇటీవల జరిగిన 'సంగీత వినోద హరివిల్లు' కార్యక్రమంలో సినిమాపాటలు పాడిన డా. కోనాడ అశోక్.

# సజాతి ధృవాలు

ఒక్కసారి శ్రీనిజ ముఖంలో మబ్బులు కమ్ముకున్నాయి. "నాకేమో ఇది పెద్ద డైలమా అయిపోయిందండీ! ఓవైపు అయ్యో చదువుకోలేక పోతున్నానే అని బాధ. మరో వైపు నా దారిన నేను వెళ్తే దీని సంరక్షణ సరిగా జరగదేమో అని బాధ. ఒకవేళ దీనికేదైనా అయితే జీవితాంతం మనసు పీకుతుంది. నేను ఇంట్లోనే వుండి వుంటే ఇలా జరిగేది కాదేమోనని. అందులోనూ మనకి ఇక పిల్లలు ...

శ్రీనిజ గొంతు వణికింది. కళ్ళల్లో నీళ్ళు నిండాయి. ప్రేమగా దగ్గరకు తీసుకున్నాడు సుధాకర్. "నువ్వింత పిచ్చిదాననుకోలేదు సిరీ! ఇంతేనా చదువంటే నీకున్న పట్టుదల, ఇంట్రెస్టు? వాణికేమీ కాదు. నువు నిశ్చింతగా ఎమ్మెస్సీలో జాయినవ్వు ఎంత డబ్బైనా మంచి ఆయాని కుదుర్చుకుందాము. ఆమె సరిగ్గా చూస్తుందో లేదో? చూడటాన్కి మా అమ్మ ఉండనే వుంది. సిరీ! ఏ విషయం గురించైనా లోతుగా ఆలోచించటం ఇంకెప్పుడు నేర్చుకుంటావు? వాణికి ఏమీ అవకూడదనే ఎప్పుడూ దేవుణ్ణి ప్రార్థిద్దాం. ఒకవేళ ఏదైనా అయిందే అనుకో! నువ్వుండి ఏదైనా చెయ్యగలవా? దాని అదృష్టం మన అదృష్టం బాగాలేకపోతే ఎవళ్ళు ఏం చెయ్యలేరు. నువ్వేమీ బాధపడకుండా జాయినవ్వు."

శ్రీనిజ యూనివర్శిటీలో జాయినయేటప్పుడు ఇంట్లో చిన్నసైజు యుద్ధం జరిగింది.

శేషమ్మకి కోడలు రోజంతా తన చేతిలో వుండకుండా పోతుందనే బాధ, తన కూతుళ్ళకీ, కొడుకులకీ అబ్బని చదువు కోడలుకి వస్తోందే అనే అసూయ, తన కొడుకు కంటె ఎక్కువ చదివి అతని మీద అధికారం సంపాయించుకుని తమనుంచి లాక్కుపోతుందేమోనని భయం వీటన్నిటితో కొడుకుమీద విరుచుకుపడింది.

"ఏరా? ఇంత చవటవయిపోయావు? పసిదాన్ని వదిలేసి టింగురంగా మంటూ వెళ్ళి ఇది కాలేజీ చదువులు వెలగబెట్టకపోతే ఎవరి కొంపలు మునిగిపోతాయి? పడుచు పెళ్ళాంమీద మోజుతో నీకు కళ్ళు మూసుకుపోయాయే? రేపది నీమాట వింటుందా? నెత్తినెక్కుతుంది. అనుభవించుదువు గాని."

"అమ్మా! ఎక్కేది నా నెత్తే కదా? నీకెందుకు బాధ? ఆ సంగతి నేను చూసుకుంటాను. ఇక పసిదానిమీద నీ కంత ప్రేముంటే స్వయాన నాయనమ్మవే కదా! జాగ్రత్తగా చూసుకో. రెండేళ్ళంతలో గడుస్తాయి?"

"అనుకుంటూనే వున్నాను. ఈ టక్కులాడి తిప్పుకుంటూ వూరంతా తిరిగి వస్తుంటే ఆ పిల్లదాని చాకిరీ నామీద పడుతుందని. ఇదుగో! ఇప్పుడే చెప్తున్నాను. ఇన్నాళ్లు మీ కందరికీ చేశాను. మీ పిల్లలకి కూడా చాకిరీ చెయ్యటం నా వల్లకాదు. ఒక్క రోజు కూడా ఆ పిల్లదాన్ని నేను చూడను."

"చూడకపోతే పోనీగాని నీవు కాస్త నోరు అదుపులో వుంచుకోమ్మా! ఇన్నేళ్ళొచ్చి అసహ్యంగా, అలగాజనంలాగ, టక్కులాడి వగలాడి అనే మాటలేమిటి? మరోసారెప్పుడు ఇలాంటి మాటలు విన్పించటాన్కి వీల్లేదు. సిరీ! సినిమాకి వెళ్దాంపద వాణిని తయారుచెయ్యి" సుధాకర్ శ్రీనిజ చెయ్యి పట్టుకుని తమ గదిలోకి తీసుకెళ్ళి అన్నాడు

"సిరీ! ఈ రెండేళ్ళు నీకు ముళ్ళ బాటలాగా వుంటుదేమో! నాకు చేతనైనంత సహాయం నేను చేస్తాను. అయినా చాలా కష్టపడాలి నువ్వు. "కృషి వుంటే మనుషులు ఋషులౌతారు, మహాపురుషులౌతారు" అదే వాక్యాన్ని పదే పదే గుర్తుచేసుకో అది నీకు నైతిక బలాన్నిస్తుంది."

సుధాకర్ గుండెలపై తలవాల్చుకుని అక్కడ విన్పిస్తున్న అతని హృదయానికి ప్రేమార్ద్రమైన మనసుతో నిశ్శబ్ద వాగ్దానం చేసింది, "సుధా! మీ వంటి ఉన్నతమైన వ్యక్తిని మరొకర్ని చూడబోనేమో! నా ప్రాణం పోయినా మీ మనసు కష్టపెట్టను."

క్లాసులు మొదలయ్యాయి. శ్రీనిజ ప్రతి రోజూ ఉక్కిరి బిక్కిరైపోయేది. ప్రొద్దున్నే వాణి అవసరాలు చూడటం, ఇంటిల్లిపాదికీ వంట, టిఫిను చెయ్యటం తను తయారయి వెళ్ళటం. శేషమ్మ ఎప్పుడూ పెత్తనాలకి వెళ్ళిపోవటమో! ఏదో నెప్పని మూలగటమో! ఏదీ లేకపోతే సాధించటం ఇంత చేసినా సంతృప్తిలేని కింద పిల్లల సతాయింపు "ఒదినా! ఈ ఉప్మా తగలేశావే? ఇఈ నువ్వే తిని నాకు ఆమ్లేట్‌వేసి ఇవ్వు." ఆర్డర్లు జారిచేసే విజయలో ఆడ లక్షణాలే కన్పించవు.

"ఒదినా! నీకూతురో మహంకాళి. నా పెన్నులో ఆడి ఎక్కడో పారేసింది. చూసివ్వు! లేపోతే నీ పెన్నివ్వు." ఇలాటి విషయాలన్నీ మహేష్‌కి సరిగ్గా శ్రీనిజ కాలేజి కెళ్ళబోయే సమయానికి గుర్తొస్తాయి. వాళ్ళనేమైనా అంటె శేషమ్మ శరవేగంతో వచ్చేసి కోడల్ని నానా మాటలూ అనేసేది.

దాదాపు ప్రతి రోజూ శ్రీనిజ లేటే! ప్రాక్టికల్ క్లాసులో కాళ్ళు ఛడిపోయేలా నించుని వస్తే అందరి సేవా మళ్ళీ మొదలు. క్లాసులో విన్నదే, లీజర్ అవర్స్‌లో అక్కడ చదువు కొన్నదే తప్ప ఇంట్లో పుస్తకం ముట్టుకునే ప్రాప్తమూ లేదు శక్తి ఉండదు శ్రీనిజకి,

ఒకరోజు సాయంత్రం శ్రీనిజ ఇంటికి వచ్చి తన గదిలో కూతురుతో ఆడుకుంటోంది. నానమ్మ చేతులు పైటచెంగులో దాచుకొని అటూ ఇటూ చూసుకుంటూ వచ్చింది. గదిలోకి రాగానే తలుపువేసి చెయ్యి చాచింది. అందులో పంచదార లడ్డూలు రెండున్నాయి.

"అదేమిటి నానమ్మా!" ఆశ్చర్యంగా అడిగింది శ్రీనిజ

"వాళ్ళు రోజూ నువ్వెళ్ళాక ఏమేంటో టిఫిన్లు చేసుకుంటారమ్మా! స్టోరు రూములో పెట్టి తాళమేస్తోంది. మీ అత్త ఆ లలితమ్మకి ఒకటి తగిలించి మరీ చెప్తారు, నీకు చెప్పొద్దని. ఈ రోజు నా మనసాగక నీకోసం ఇది తీసి దాచాను. తినమ్మా!"

శ్రీనిజ కళ్ళు తడిశాయి ఏమికాని పనిమనిషి కున్న ఆత్మీయతలో, మానవత్వంలో వందో వంతు లేదు తన అత్త శేషమ్మకి. తను శత్రువు కాదే! స్వయాన కొడుకు భార్య. ఎందుకిలా చేస్తుంది?

చాచిన నానమ్మ చెయ్యి మూసేసింది శ్రీనిజ.

"నానమ్మా! నువ్వెంత మంచిదానివి! కాని ఇలా ఎప్పుడూ చెయ్యకు. ఈ తిండి లేకపోతే నా కండ కరిగిపోదు. వాళ్ళనే తిననియ్యి నానమ్మా! వాళ్ళు రహస్యంగా చేసుకొని దాచుకొన్నది నేను దొంగతనంగా తిని వాళ్ళతో సమానమైపోలేను." నానమ్మ ఏం మాట్లాడకుండా వెళ్ళిపోయింది. ఆ తరువాత నాలుగైదు రోజుల్నించీ రెండు రోజులకోసారి సుధాకర్ స్వీట్స్ పాకెట్ తెచ్చి ఇంట్లోకి రాబోయే ముందు కిటికీనుంచి తమ ట్విన్ బెడ్మీదకి విసిరేసి ఇంట్లోకి వచ్చేవాడు. ఎందుకిలా చేస్తున్నారని శ్రీనిజ ఎన్నిసార్లడిగినా సుధాకర్ కారణం చెప్పలేదు.

దిన దిన గండంగా ఫస్టియర్ పూర్తయింది. సెకండియర్లో ప్రతిరోజూ మొదటి క్లాసు ప్రొఫెసర్ది. ఆయనకి లేటుగా ఎవరైనా వస్తే విపరీతమైన కోపం. ఎంత ప్రయత్నించినా ఒకరోజు శ్రీనిజ ఆయన క్లాసుకి లేటుగా వెళ్ళనేవెళ్ళింది. గుమ్మం దగ్గిర నుంచుని లోపలికి రావటాన్కి పర్మిషన్ అడిగిన శ్రీనిజని తినేసేలా చూశాడాయన.

"మిసెస్ శ్రీనిజా! నువు లేటుగా రావటం వలన ఎంతమంది డిస్టర్బ్ అవుతున్నారో తెలుసా? నా లెక్చర్ కంటిన్యుటీ పోతుంది. మిగతా స్టూడెంట్సందరి అటెన్షనూ వేవర్ అవుతుంది. ఇన్నేళ్ళుగా చదువుకుంటున్నావు. ఈ చిన్న విషయం నీకెవరూ చెప్పలేదా? కమిన్! మీకందరికీ ఇదే నా రిక్వెస్ట్. లేటుగా వచ్చినవాళ్ళు దయచేసి నా క్లాసుకి రావద్దు.'

శ్రీనిజ ముఖమంతా ఎర్రగా కందిపోయింది. అతి ప్రయత్నంమీద ఏడుపాపుకుంది. అప్పట్నుంచీ దాదాపు రోజు విడిచి రోజు ఆయన క్లాసులు ఎగ్గొట్టటమే.

ఒక్కోసారి శ్రీనిజకి చెప్పలేనంత విరక్తి కలుగుతుంది. ఈ విధంగా చదివి ఏమి ఆనందం? మానిసారేస్తే పీడాపోతుంది అనుకునేది. అంతలోనే భర్త మాటలు గుర్తొచ్చి మనసు దృఢం చేసుకునేది.

ప్రొద్దున్న టిఫెన్ తినకుండా వచ్చేసిందేమో, వలయాలుగా తిరుగుతున్న ఆలోచనలతో సమంగా శ్రీనిజ తలకూడా తిరగసాగింది. నెమ్మదిగా కళ్ళ ముందు చీకటి ముసురుకుంది చిన్నగా చప్పుడు చేస్తూ ఆమె తల ముందున్న డెస్క్మీదకి వాలిపోయింది. ఒళ్ళంతా చెమటలు కారిపోతున్నాయి. ఖంగారుగా తలిమ్మా స్టూడెంట్సంతా ఆమె చుట్టూ చేరారు. ఎవరో డాక్టరు కోసం ఫోన్ చేశారు. మరెవరో కొంచెం నీళ్ళు ముఖంమీద చల్లి నీళ్ల గ్లాసు నోటి కందించారు. డాక్టరు వచ్చి హైపో గ్లైసీమియా అని గ్లూకోజ్ ఇంజెక్షనిచ్చారు. ఇద్దరమ్మాయిలు తీసుకెళ్ళి లాబ్లో బెంచిమీద పడుకోబెట్టి క్లాసుకి వెళ్ళిపోయారు.

మూసుకున్న కళ్ళనుంచి నీళ్ళు ధారలుగా కారసాగాయి. అలా ఎంతసేపు వుందో? తలమీద ఆత్మీయత నిండిన చెయ్యి పడటంతో కళ్ళు తెరిచింది. తెరవగానే కల్గిన ఆశ్చర్యంతో దాదాపు బెంచీమీద నుంచి కింద పడిపోయింది. ఎదురుగా ప్రొఫెసర్ గారున్నారు. ఆయన వారిస్తున్నా లేచి కూర్చుంది.

"శ్రీనిజా! బహుశా నేను కోప్పడతాననే భయంతో ఫెయింట్ అయివుంటావు. అవునా? ఇంతక్రితమే వసంత వచ్చి నీ గురించి నా కంతా చెప్పింది. నీకున్న ఓర్పు, పట్టుదల ఇంతవరకూ నేను మరే స్టూడెంటులోనూ, చూడలేదు. ఎప్పుడూ ధైర్యాన్ని కోల్పోకు. దేవుడు నీకు మేలుచేస్తాడు. లేటయినా నా క్లాసుకి రావడం మానెయ్యొద్దు. నా పర్మిషన్ అడక్కుండానే సరాసరి నీ సీటులోకి వెళ్ళి కూర్చో. ఇందాక టెస్ట్ బాగాచేశావు. విష్ యూ ఆల్ ది బెస్ట్."

కృతజ్ఞతతో మూగబోయిన శ్రీనిజ కంఠంలోనే ఆగిపోయాయి "థాంక్యూ సర్" అనే మాటలు. కళ్ళతోనే వ్యక్తీకరించింది. ప్రోత్సాహకరంగా చిరునవ్వు నవ్వి, ఇంటికి వెళ్ళి రెస్ట్ తీసుకోమని చెప్పి హుందాగా తన రూమ్వైపుకి సాగిపోయాడాయన.

శ్రీనిజ చదువాపెయ్యడాన్కి శేషమ్మ చేసిన ప్రయత్నాలన్నీ విఫలమయ్యాయి. కాలం నత్తలా నడిచినా ఫైనల్ పరీక్షలు రానే వచ్చాయి. మొదటి పరీక్ష అయింది. రెండవ రోజు పరీక్షకి తయారవుతోంది శ్రీనిజ. ఎనిమిదవుతున్నా నానమ్మ లేవలేదు. విసుక్కుంటూ లేపటానికెళ్ళింది. చేత్తో కుదపబోయి ఉలిక్కిపడింది. నానమ్మ ఒళ్ళు నిప్పులా కాలిపోతోంది. శ్రీనిజ గుండె ఝల్లుమంది. భయపడుతున్నంతా అయింది. రెండురోజుల్నించీ నానమ్మ రొంప, తలనొప్పి అంటూనే వుంది. ఈ రోజు స్పృహలేకుండా జ్వరం మొచ్చేసింది. ఇప్పుడు పరీక్ష కెళ్ళటమెలా? అంతా తన ఖర్మ. రెండురోజుల క్రిందటే సుధాకర్ స్టాక్ తేవటాన్కి బొంబే వెళ్ళాడు. అతనుంటే వాణిని ఎలాగోలా చూసుకునేవాడు. ఈ రోజు మధ్యాహ్నానికిగాని రాడు. తల్లి దగ్గర వదిలేద్దామంటే వాణికి శేషమ్మ పుణ్యమా అని అమ్మమ్మ అలవాటవలేదు ఎంత బతిమాలినా రెండు రోజులు కూడా పుట్టింటికెళ్ళనిచ్చేదికాదు.

భయపడుతూనే అత్తగారి దగ్గర కెళ్ళింది "అత్తయ్యా! నేను ఒంటిగంటకల్లా వచ్చేస్తాను మీరు కాస్త వాణిని.."

శేషమ్మ ముఖంలో విజయగర్వం తొంగి చూసింది. "నేను ముందే చెప్పలా? నీ కూతురి చాకిరీతో నా ప్రాణం తియ్యొద్దని. కుదురయిన పిల్లయితే పోనీలే అని చూసేదాన్ని. ప్రపంచంలో మీకేగాదా కూతురున్నట్లు పిచ్చగారం చేసి దాన్నెందుకూ పనికిరాకుండా చేశారు. నాలుగు గంటలు కాదు నాలుగు నిమిషాలు దాన్ని నేను సముదాయించలేను తల్లీ! నీ పాట్లేవో నువు పడు."

ఆశగా పెద్దాడబడుచు విజయ దగ్గర కెళ్ళింది "విజయా! వాణిని ఈ ఒక్కరోజు .."

"నువు మహారాణీలా కాలేజీ కెళ్ళొస్తుంటే నేను నీకు ఊడిగం చెయ్యాలాండి ఒదినగారూ! మా ఫ్రెండ్సందరం మార్నింగ్ షోకి వెళ్తున్నాం నేనుండను ఇంట్లో" శేషమ్మ కూతురి వైపు ప్రశంసాపూర్వకంగా చూసింది.

చివరి ఆశగా లలిత దగ్గరకెళ్ళింది "లలితా బంగారుతల్లివి కదూ? నేనొచ్చేవరకు వాణిని ఆడిస్తావా? నేన్నీకు మంచి ఫ్రాంకు కొనిపెడ్తాను?"

"ఓ అలాగే ఒదినా?" రెడీగా ఒప్పేసుకుంది లలిత. శేషమ్మకి ఒళ్ళు మండిపోయింది.

లలితకి సవాలక్ష జాగ్రత్తలు చెప్పి, చికాకు ఆందోళన నిండిన మనసుతో పరీక్షకి బయలుదేరింది శ్రీనిజ. పరీక్ష మొదలయింది. ఒక గంటన్నరయింది. మరో గంటన్నర వుంది. ఇంతలో వరండాలో ఏదో గొడవ విన్పించింది. అందరి తలలూ అటు తిరిగాయి. అటెండరు లలితను బయటకి తీసుకెళ్ళటాన్కి ప్రయత్నిస్తున్నాడు. లలిత పెనుగులాడుతోంది హడావిడిగా శ్రీనిజ లేవబోతుండగానే ఫ్యూను చేతుల్ని బలంకొద్దీ విదిలించేసి బాణంలా పరీక్ష హాల్లోకి దూసుకొచ్చేసింది "ఒదినా ఒదినా" అని అరుస్తూ. శ్రీనిజ గబుక్కున ఆ పిల్ల నోరు నొక్కేసి ఇన్విజిలేటర్కి సారీ చెప్పి బయటకి ఓ మూలకి లాక్కెళ్ళింది.






## కార్టూనిస్టులకు సూచనలు!

- ★ కార్టూన్‌లను మంచి డ్రాయింగు కాగితంమీద ఇండియన్ యింకుతో గీసి పంపాలి
- ★ ప్రతీ కార్టూన్ వెనుక కార్టూనిస్టు పేరు, చిరునామా ఉండాలి.
- ★ వ్యంగ్య చిత్రాలు ప్రస్ఫుటంగా సాధ్యమైనంతవరకూ వాటిపై 'వ్యాఖ్య' చదవటానికి ముందే నవ్వించేవిగా అర్థవంతంగా వుండాలి!
- ★ వ్యాఖ్య చిన్నదిగా క్లుప్తంగా వుండాలి అక్షరాలు కుదురుగా మొదటిసారి చదివినప్పుడే అర్థం అవ్వాలి! కార్టూన్ మీద పేరూ వూరు అన్నీ రాస్తే అవి తిరస్కరింపబడే అవకాశాలుంటాయి.
- ★ సొంత చిరునామా గల తపాలా బిళ్ళలు అంటించిన కవరుగల కార్టూన్‌లను త్రిప్పిపంపడం జరుగుతుంది దారిలో పోయేవాటికి మా బాధ్యతలేదు.
- ★ ఎన్నుకొన్న కార్టూన్‌లలో అన్నీగాక కొన్ని మాత్రమే ఒక్కోసారి వేసుకోడం జరుగుతుంది పరిశీలనకి ఐదారువారాలు పట్టవచ్చు.
- ★ పండుగల కార్టూన్‌లు – బాగా ముందుగా వాటి కవరు మీద ఆ "ప్రత్యేక" సందర్భాన్ని పేర్కొంటూ పంపడం అవసరం.
- ★ రంగుల కార్టూన్‌లు, పెన్సిలు బొమ్మలు, తెల్లకాగితంమీద వేసిన బొమ్మలు పంపవదని మనవి.
- ★ మా కార్యాలయానికి స్వయంగావచ్చి కార్టూన్‌లు అందజేసేవారు కూడా స్వంత చిరునామాగల స్టాంపులతికించిన కవరు జతచేయాలి. కాపీ కార్టూన్‌లు పంపరాదు.

– సం॥

## సజాతి ధ్రువాలు

"ఏమిటి" చెయ్యి తీసి అడిగింది. ఆమె గుండెల సవ్వడి వరండా అంతా మార్మోగుతోందా అన్నంత వేగంగా కొట్టుకుంటోంది.

"ఒదినా వాణి మరి వాణి బాత్‌రూమ్‌లో .." ఏడుపు లంకించుకుంది లలిత.

"వాణికేమయింది చెప్పు లలితా" గట్టిగా కుదిపింది,

వెక్కుతూ చెప్పింది. వాణికి నీళ్ళంటె చాలా ఇష్టం. బాత్‌రూమ్‌లో సిమెంట్‌తో నీళ్ళకోసం కట్టిన తొట్టె వుంది. ఎప్పుడూ అక్కడకెళ్ళి ఆడుతూ వుంటుంది. ఈ రోజు కూడా అలాగే వెళ్ళింది. లలిత వీధిలో తన ఈడు పిల్లలతో ఆడుకుంటూ వాణి సంగతి మరిచిపోయింది. వాణి తీరా బయటకి రావటానికి ప్రయత్నించినపుడు బోల్ట్ తియ్యటం చేతకాలేదు కాబోలు, లోన్నుంచి తలుపులు బాదుతూ గెంతుతూ ఏడవటం ఆరంభించింది. కాలుజారింది కాబోలు వెనక్కి పడిపోయింది. పడిన శబ్దం విన్పించగానే ఏడుపు ఆగిపోయింది. వెంటిలేటర్ నుంచి చూసేసరికి కదలిక లేకుండా పడివుంది. ఇదీ సారాంశం : లలిత ఖంగారుగా శేషమ్మని వెలికి తీసుకొచ్చింది. ఆవిడే ఆటో తెచ్చి అడ్రసు చెప్పి లలితనిక్కడికి పంపించింది.

శ్రీనిజ మళ్ళీ క్లాసులోకి వెళ్ళనే లేదు. లలితని లాక్కెళ్ళి ఆటోలో కూలేసింది. ముందు వాళ్ళ ఆటో మొబైల్ స్పేర్‌పార్ట్స్ షాపు దగ్గర కెళ్ళి అక్కడి కుర్రాడ్ని తీసుకొని ఇంటికెళ్ళారు. శేషమ్మ దీర్ఘాలు తీస్తోంది. కుర్రాడు బోర్ట్ మీద పని ప్రారంభించాడు. వెంటిలేటర్ నుంచి చూసింది. వాణి చలనం లేకుండా పడివుంది. ఒక పావు గంటలో షాపు కుర్రాడు బోల్టుకున్న స్క్రూ మేకలన్నీ లూజుచేసి తలుపు తీశాడు. ఒకంగలో వెళ్ళి వాణిని తీసుకుంది. వెనక్కి తిప్పిచూసింది. తల వెనక భాగంలో మెడపైగా తగిలినట్లుంది. అక్కడంతా నల్లగా అయిపోయింది. వాణిని భుజం మీదేసుకొని పిచ్చిదానిలా బయటకి పరిగెత్తి కన్పడిన ఆటోలో ఎక్కేసి ఫామిలీ డాక్టరు అడ్రెసు చెప్పింది.

వాణిని పరీక్షించి డాక్టరు పెదవి విరిచాడు. "తల వెనుక భాగంలో గట్టి దెబ్బతగిలింది. కంకషన్ అనుకుంటున్నాను. ప్రాణంపోయి అరగంటవుతుందేమో"

తను అనుమానించిందే డాక్టర్ కన్‌ఫర్మ్ చేశాడు. అప్పటి వరకూ బలవంతాన కూడ గట్టుకుంటున్న ఆత్మ నిగ్రహం సడలిపోగా వాణి శరీరంమీద వాలిపోయింది.

మినార్ ఎక్స్‌ప్రెస్‌లో దిగిన సుధాకర్ విషయం వింటూనే డాక్టరు దగ్గరకు వచ్చేశాడు. ఎవరికి ఏమొచ్చినా ఆ డాక్టరే! అందుకే అక్కడికిపరిగెత్తాడు. అక్కడ వాణి ఒక బల్లమీద, శ్రీనిజ ఒక బల్ల మీద చలనం లేకుండా పడుకుని వున్నారు. సుధాకర్ పిచ్చిగా ఇద్దరి వంకా మార్చిచూశాడు.

డాక్టరు సుధాకర్ భుజంమీద చెయ్యి వేసి చెప్పాడు. "అబౌట్ వాణి, అయామ్ సారీ! శ్రీనిజకి సెడేషన్ ఇచ్చాను. ఈ రోజంతా లేవకుండా రెండు మూడురోజులు ఇలా వుంచటమే మంచిది. ఆవిడ్ని హాస్పటల్లోనే వుంచెయ్యండి. ఇంట్రావీనస్‌గా ఫ్లూయిడ్స్ ఇవ్వాలి."

సుధాకర్ శ్రీనిజ దగ్గరకెళ్ళాడు. తెల్లగా పాలిపోయివున్న ఆమె ముఖాన్ని గుండెలకి హత్తుకున్నాడు. "సిరీ నన్ను క్షమించు. ఇదంతా నా మూలంగానే" అతని గొంతు పూడుకుపోయింది. సరిగా పడుకోబెట్టేసి డాక్టరువైపు తిరిగాడు. "డాక్టర్ ఒక అరగంటలో వాళ్ళ అమ్మగార్ని హాస్పటల్‌కి పంపుతాను. అంతవరకు .."

"డోంట్ వర్రీ గో అహెడ్."

వాణిని భుజాన్నేసుకుని లోనకొస్తున్న కొడుకుని గుమ్మంలోనే ఎదుర్కొంది శేషమ్మ. "ఏమన్నాడురా! డాక్టరు? అదేదీ? వెళ్ళేటప్పుడు ఏ డాక్టరు దగ్గర కెళ్తుందో ఒక ముక్కచెప్పి పోతే దాని సొమ్మేం పోతుంది. ఒళ్ళంతా పొగరే దానికి. అయినా సంసారికీ చదువులేమిట్రా అని నేను మొత్తుకుంటూనే వున్నాను."

"అమ్మా! నువ్వు నోరుముయ్యకపోతే నీ పీక నొక్కి చంపేస్తాను. నీలాంటి ఆడది నిజంగా భూదేవికే భారం. అది నీకేం అపకారం చేసింది? దాన్నిలా వెంటాడి వేటాడావు? నానమ్మ నాకు చెప్తూనే వుండేది. కాని ఇంత రాక్షసత్వం నల్లురపిల్లల్నికన్న నీలో వుంటుందనుకోలేదు."

తన గదిలోకి వెళ్ళిపోయి వాణిని సున్నితంగా పరుపుమీద పడుకోబెట్టాడు. అతని కళ్ళల్లోంచి కారే నీళ్ళు వాణి ముఖాన్ని అభిషేకిస్తున్నాయి. అంత విచారంలోనూ అతనికి తను చిన్నప్పుడు చదువుకున్న సైన్సు పాఠం గుర్తొచ్చింది. "సజాతి ధ్రువములు వికర్షించుకొనును. విజాతి ధ్రువములు ఆకర్షించుకొనును." ★

## కేన్సర్ రోగులతో ప్రముఖుల ముచ్చట్లు

పశ్చిమ జర్మనీలో బవేరియా రాష్ట్రం లోని ఒక కేన్సరు ఆసుపత్రిలో కేన్సరు రోగులకు చక్కటి కాలక్షేపాన్ని ఏర్పాటు చేశారు. దేశంలోని ప్రముఖులను పిలిచి వారితో ముచ్చటించే కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాన్ని ప్రముఖ వైద్య పత్రికా రచయిత జార్జి ప్రీబర్ నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమాల్లో పాల్గొన్న ప్రముఖుల్లో పశ్చిమ జర్మనీ ఛాన్సలర్ సతీమణి శ్రీమతి లోకిస్మిట్, బవేరియా రాష్ట్ర ప్రధాని సతీమణి శ్రీమతి స్ట్రాస్‌కూడా ఉన్నారు. మరొక380మంది సినిమానటులు, రంగస్థలనటులు, టెలివిజన్ నటులు కూడా ఈ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. శ్రీ జార్జి ప్రీబర్ సునిశితమైన రచయిత. అయితే ఆయన ఈ కార్యక్రమంలో వినోదానికే ప్రాముఖ్యతనిస్తున్నారు. జీవితంలో హాస్యం లేకపోవడం కూడా ఒక వ్యాధేనని ఆయన భావిస్తారు. ఈ కార్యక్రమాల ద్వారా సేకరించిన నిధులను కేన్సరు నివారణ నిధికి అందచేస్తారు.